వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

● ఉత్తర ద్వారం గుండా విష్ణువుని దర్శించుకునేలా ఏర్పాట్లు
● భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల చర్యలు

మన్సూరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి ఆ మహా విష్ణువుకి ఎంతో ప్రీతికరమైనది. నేడు(శుక్రవారం) వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్, మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని వైష్ణవాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. ప్రతి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయాల కమిటీలు, నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ పవిత్రమైన రోజున ఆ మహావిష్ణువుని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటే ఎంతో మంచి చేకూరుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఆలయాలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉంది.

కొత్తపేట: కొత్తపేట డివిజన్‌లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి విశేష పూజలకు, ఉత్తరద్వార దర్శనానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయనుండడంతో ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్నేహపురి కాలనీలో వెలసిన శ్రీగోదా సమేత పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో రంగు రంగుల పూలమాలలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. తెల్లవారు జామున 4.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తిరిగి సాయంత్రం 6గంటల నుంచి 10గంటల వరకు స్వామివార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తుల కోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. మోహన్‌నగర్ ఎస్బీహెచ్‌లోని హరిహరక్షేత్రంలో పద్మావతి వేంకటేశ్వరాలయం, సత్యానగర్ హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరాలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామివార్ల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


వైకుంఠ ఏకాదశికి ముస్తాబవుతున్న మన్సూరాబాద్ ఆదిత్యనగర్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం


వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలకు ముస్తాబైన స్నేహపురి గోదాసమేత పద్మావతి వేంకటేశ్వరాలయం



వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి ముస్తాబైన ఆర్కేపురం వాసవికాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం


విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పట్టుదలతో విజయం సాధించాలి

● రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో విజయం సాధించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ. నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడలోని ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులకు నోట్‌బుక్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా అక్కడి సమస్యలను హాస్టల్ వార్డెన్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, మాడ్గుల, మంచాల్ తహసీల్దార్లు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

సరూర్‌నగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 8వ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌కాలనీలో కొత్తగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ తీట శ్రీధర్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ గుడెపు ఇంద్రసేన ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి, ఎదుళ్ల ప్రతాప్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..

అల్మాస్‌గూడ 3వ, 4వ డివిజన్ల పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, సీఎంఆర్ కాలనీల్లో చేపట్టనున్న బీటీరోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ పారిజాతారెడ్డి కార్పొరేటర్ రామిడి మాధురీవీరకర్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సందెప్ప వెంకటరెడ్డి, రామిడి సూరకర్ణరెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


రాఘవేంద్రనగర్ కాలనీ, పోచమ్మ ఆలయ కమిటీ కార్యవర్గం సభ్యులు

రాఘవేంద్రనగర్ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ రామచంద్రనగర్ కాలనీ సంక్షేమ సంఘం, పోచమ్మ ఆలయం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు హరినాథబాబు, బుచ్చిరెడ్డి వ్యవహరించగా వారి సమక్షంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నర్సయ్య నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ

రామచంద్రనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కే. రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే. శైలనాథ్, కోశాధికారిగా సీహెచ్ వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పీ. వెంకటరాములు, సంయుక్త కార్యదర్శిగా ఎస్. జనార్దన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

పోచమ్మ ఆలయ కమిటీ

పోచమ్మ ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా కే. శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిజివాడ నరహరి, కోశాధికారిగా సీహెచ్. సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కే. శ్రీను, సంయుక్త కార్యదర్శిగా దర్శన్‌లను ఎన్నుకున్నారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు : సీజీఎం

సైదాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) లక్ష్యమని హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ అన్నారు. హిమాయత్‌నగర్ రీజియన్‌లో ప్రస్తుతం 49 ఎస్‌బీఐ శాఖలు సేవలందిస్తున్నాయని వివరించారు. మారుతున్న కాలంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాలైన ముద్ర, స్టాండప్ ఇండియా, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన వంటి వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామన్నారు. జనరల్ మేనేజర్(నెట్‌వర్క్) ప్రకాశ్‌చంద్ర బరోర్, డీజీఎం రవీంద్ర, రీజనల్ మేనేజర్ రవికాంత్, బ్రాంచి మేనేజర్ ప్రదీప్ పాల్గొన్నారు.


ఎస్‌బీఐ చంపాపేట్‌గూడ బ్రాంచిని ప్రారంభిస్తున్న సీజీఎం రాజేష్‌కుమార్

ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యత పాటించాలి

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాడైన దారుల ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యత పాటించాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మోహన్‌నగర్‌లో పర్యటించారు. జలమండలి వారు మోహన్‌నగర్‌లో జరిగిన చేపట్టిన పైప్‌లైన్ పనులతో దారులు పాడయ్యాయి. వాటికి ప్యాచ్‌వర్క్ పనులు జరుగుతున్నాయి. పనులను పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ జలమండలి పైప్‌లైన్ పనులు ముగిసిన తర్వాత ప్యాచ్‌వర్క్ సరిగా చేపట్టకపోవడంతో గుంతలు పడ్డాయని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ రూ. లక్ష విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను వితరణగా అందజేసింది. గురువారం ఆ సంస్థ ప్రతినిధులు అరవింద్, వంశీ, రామేశ్వరరావు, సునీల్ టెక్నీషియన్‌తో వచ్చి స్కూల్‌లో అమర్చారు. ఈ సందర్భంగా పూజలు చేసి ఫిల్టర్‌ను హెచ్ఎం ప్రభాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కవాడిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొడిగె కిష్టయ్య కుమారుడు సత్యప్రకాష్ స్కూల్‌లో సింటెక్స్ వాటర్ ట్యాంక్ కోసం రూ.5వేలను గురువారం హెచ్ఎంకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాములయ్య, వెంకటయ్య, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరద లైన్‌లోకి సీవరేజ్ లైన్ కలపొద్దంటూ ఆందోళన

● పనులను అడ్డుకున్న సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు

మన్సూరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలోని వరదనీటి పైప్‌లైన్‌లోకి సీవరేజ్ కనెక్షన్ కలపొద్దంటూ వాటర్ వర్క్స్ అధికారుల పనులను మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు మరోసారి అడ్డుకున్నారు. డివిజన్ పరిధిలోని ఎల్బీటీ మార్కెట్ వెనకాల ఉన్న హైరైజ్ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థను శుద్ధిచేసే సమీపంలోని సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని వరదనీటి పైప్‌లైన్ కనెక్షన్‌ను కలపాల్సి ఉంది. కానీ అపార్ట్‌మెంట్ బిల్డర్ డ్రైనేజీ వ్యవస్థను శుద్ధిచేయకుండా ఆ పైప్‌లైన్‌ను తమ కాలనీలోని వరదనీటి పైప్‌లైన్‌కు కలుపుతున్నట్లు తెలుసుకున్న కాలనీవాసులు జలమండలి అధికారులను నిలదీశారు. జలమండలి అధికారులు చేపడుతున్న పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎస్‌టీపీ చేసిన వాటర్ లైన్ కలుపుతున్నట్లు ఆర్డర్ కాపీ ఉందంటూ సీవరేజ్ విభాగానికి చెందిన సీజీఎం జ్ఞానేశ్వర్‌రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డిలు సిబ్బందితో కలిసి మరోసారి గురువారం వరదనీటి లైన్‌కు కలిపే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న సెంట్రల్ బ్యాంక్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలరెడ్డితో కలిసి కాలనీ సభ్యులు, కాలనీవాసులు అక్కడకు చేరుకుని పనులను చేపట్టొద్దంటూ తమ వద్ద హైకోర్టు స్టేఆర్డర్ ఉందని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాలనీ తరఫు హైకోర్టు న్యాయవాది ప్రభాకర్‌శర్మ సైతం అక్కడకు చేరుకుని పనులు చేపట్టొద్దంటూ హైకోర్టు స్టే విధించిందని వివరించడంతో వాటర్‌వర్క్స్ అధికారులు పనులను నిలిపివేశారు. ఈ ఆందోళనలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాకేష్ సింగ్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, భైరవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, ఇతర సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


పనులు నిలిపివేయాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగిన సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు


సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న మధుయాష్కీగౌడ్

సీఎం సహాయ నిధితో పేదలకు మేలు: మధుయాష్కీ

ఎల్బీనగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధితో ఎంతో మంది పేదలకు మేలు చేకూరుతున్నదని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీని సంప్రదించడంతో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసి మంజూరు చేయించారు. ఆ చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. నాగోల్‌కు చెందిన జగ్గీనర్‌గౌడ్(రూ.60వేలు), లింగోజిగూడకు చెందిన అశ్విని(రూ.60వేలు), హయత్‌నగర్‌కు చెందిన త్రిపుర సుందర్‌రెడ్డి(రూ.60వేలు)లకు సీఎం సహాయ నిధి చెక్కులను మధుయాష్కీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవి, మంజులారెడ్డి పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

చాదర్‌ఘాట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండగుడుపు వెంకటేష్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టిపాక ప్రభాకర్‌మాదిగ గురువారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఆయన చేతుల మీదుగా వెంకటేష్ నియామక ఉత్తర్వులను అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు గ్యార సతీష్, జిల్లా అధ్యక్షుడు రవిమాదిగ, పవన్‌మాదిగ పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలి


నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

మన్సూరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు, ఆటపాటల్లో తమ సత్తాను చాటాలని సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత సూచించారు. మన్సూరాబాద్‌లోని ఎంఆర్‌డీ వంశీకృష్ణ పాఠశాల వార్షికోత్సవాలు గురువారం మనంగా నిర్వహించారు. డీసీ సుజాత మాట్లాడుతూ పుస్తక జ్ఞానంతో పాటు జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శివతాండవం, తల్లిదండ్రుల ప్రాధాన్యత, బృందావన నృత్యప్రదర్శన, ఇస్రో, సైనికుల ప్రాధాన్యతను వివరిస్తూ చిన్నారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రిన్సిపాల్ ఉపాలాల్, డైరెక్టర్ వసుధరాణి, సతీష్, అర్జీలు రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు విలువలూ నేర్పిద్దాం

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు విలువలూ నేర్పిద్దామని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, ప్యానెల్ అడ్వకేట్లకు, పారాలీగల్ వలంటీర్లకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందించిన నల్సా(ఛైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్) అనే కొత్త బాలల చట్టం మీద శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలోని లీగల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్లు పిల్లలు అనుకూలమైన చట్టపరమైన సేవలను అందించడానికి బలోపేతం చేయడానికి ఈ పథకం కృషి చేస్తుందన్నారు. వైకల్యాలున్న పిల్లలతో సహా పిల్లల నిపుణులు, ప్రత్యేక కఠిన, సమర్థవంత న్యాయ నిపుణులను సంప్రదించడానికి వారి చట్టపరమైన హక్కులు, కోర్టు ప్రక్రియలు, విధానాలను అర్థం చేసుకోవడానికి, అధికారం పొందేలా ఈ పథకం నిర్ధారిస్తుందన్నారు. అదనంగా సామాజిక భద్రతా వలయం నుంచి బయటపడటానికి అత్యంత దుర్బలంగా ఉన్న పిల్లలను గుర్తించి సహాయం చేయడానికి, కమ్యూనిటీ ఔట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహించడం లీగల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రమాదేవి, నీరజ, సోషల్ వర్కర్ అమితారాణి, జ్యోతిరావు, న్యాయవాదులు కపిల్, హేమలతలు బాలల హక్కుల మీద అవగాహన కల్పించారు.



శిక్షణ శిబిరంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి, ప్రవీణ్

ముగ్గురు బాలురు అదృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: ముగ్గురు బాలురు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాను కాలనీకి చెందిన పవన్ కుమారుడు శ్రీచరిత్(12)కుంట్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. బంజారా కాలనీకి చెందిన శివకుమార్ కుమారుడు చరణ్(13) హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. శాంతినగర్‌కాలనీకి చెందిన కార్తీక్(13) ముగ్గురూ స్నేహితులు. ప్రతి రోజులాగా వీరు స్కూల్‌కు వెళ్లకుండా బయట కాలక్షేపం చేస్తూ సాయంత్రం ఇంటికి వెళ్తున్నారు. కాగా, బుధవారం వీరు ఇంటికి వెళ్లలేదు. పిల్లలు ఇంటికి రాలేదని శ్రీచరిత్ తండ్రి పవన్, చరణ్ తండ్రి శివకుమార్ గురువారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పెషల్ టీంలు ఏర్పాటు చేసిన హయత్‌నగర్ పోలీసులు స్కూల్ వద్ద సీసీ పుటేజీలను పరిశీలించగా ముగ్గురు కలిసి వెళ్తున్న దృశ్యం కనిపించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్..

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కండక్టర్ అదృశ్యం అయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హయత్‌నగర్ వీరభద్రకాలనీకి చెందిన పెరుమళ్ల రాజేశ్వర్(41) ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 14న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. డ్యూటీ అయిపోయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతడికి ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం అతడి కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎన్ఆర్ కాలనీలో మెగా వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3 సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 750మంది ఈ శిబిరంలో ఉచిత పరీక్షలు చేయించుకున్నట్లు సురక్ష సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల గోపీశంకర్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, సంస్థ ప్రతినిధులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

జహెద్‌కు హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

సైదాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉగ్రదాడి కుట్ర పన్నిన కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న మహ్మద్ అబ్దుల్ జహెద్ ఆరోగ్యం మొజుకు ప్రాణహాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. గురువారం చంచల్‌గూడ జైలు గేటు వద్ద జహెద్ కుటుంబానికి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. జహెద్ షుగర్ వ్యాధితో జైలులో బాధపడుతున్నాడని సరైన వైద్యం, తిండి అందించడం లేదని ఆరోపించారు. జైలు అధికారులు కక్షపూరితంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. జైలు నుంచి ఈనెల 2న చంచల్‌గూడ జైలుకు తరలించారని చెప్పారు. కోర్టు ఆదేశాలను సైతం పాటించకుండా అధికారులు జహెద్‌ను ఇబ్బందులకు గురిచేస్తూ ములాఖత్‌లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ విషయమై జైలు అధికారులను వివరణ కోరగా ఆరోపణల్లో వాస్తవం లేదని, జైలు నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామని చెప్పారు.


జైలు వద్ద ఆందోళన చేస్తున్న జహెద్ కుటుంబ సభ్యులు

బాలికను వేధించిన వ్యక్తికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సోకోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పీపీ సునీత బల్ల కథనం ప్రకారం నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికను ప్రేమపేరిట రోజూ వెంబడిస్తూ వేధిస్తూ అక్రమంగా ఇంట్లో చొరబడి లైంగికదాడికి పాల్పడిన నిందితుడు కే.నవీన్ పై కేసు నమోదు అయింది. పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జ్‌షీటు వేయగా సాక్షులను విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి ఎంఎ్ పద్మావతి నిందితుడికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 4వేలు జరిమానాతో పాటు రూ. 50వేలు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రజలు సహకరించాలి

వనస్థలిపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌కు ప్రజలు సహకరించాలని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి అన్నారు. వనస్థలిపురం హుడాసాయినగర్ కమాన్ వద్ద వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్, ఇతర అంశాల పట్ల కాలనీవాసులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కమిటీల ఎన్నిక

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

మన్సూరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త అభిప్రాయాల మేరకు రంగారెడ్డి అర్బన్ జిల్లా పరిధిలోని పార్టీ డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎన్నికల పరిశీలకుడు జి.ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి జి.సుభాష్‌చందర్‌జీతో కలిసి ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 22 డివిజన్లకు గాను 16, 1100 పోలింగ్‌బూత్‌లకు గాను 850 బూత్ కమిటీలను వేశామని, పూర్తిస్థాయి కమిటీలను సంక్రాంతి అనంతరం ప్రకటిస్తామన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని, పదవులు రాని వారు ఎవరూ నిరుత్సాహ పడకుండా పని చేస్తూ పోతే కచ్చితంగా వారికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. సమావేశంలో ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ డివిజన్ నూతన అధ్యక్షులు వీరే..

నాగోల్ డివిజన్ అధ్యక్షుడిగా వంగా శ్రీకాంత్, మన్సూరాబాద్‌కు ఎంహెచ్ రవిరెడ్డి, హయత్‌నగర్‌కు గంగాని శ్రీనివాస్, హస్తినాపురంకు ఎరుకల మల్లేష్‌గౌడ్, చంపాపేట్‌కు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కొత్తపేటకు మంచి రాజేష్‌కుమార్, చైతన్యపురికి జి.నవీన్‌యాదవ్, గడ్డిఅన్నారంకు దాసరి జయప్రకాష్, మియాపూర్‌కు ఆకుల లక్ష్మణ్, హఫీజ్‌పేట్‌కు కె.జితేందర్, గచ్చిబౌలికి శివకుమార్ కింగ్, మాదీనగర్‌కు డాక్టర్ వంశీరెడ్డి, ఆల్విన్‌కాలనీకి ఎరమేష్, షాపూర్‌నగర్‌కు బాలుయాదవ్, శేరిలింగంపల్లికి బి.కిశోర్‌యాదవ్, చందానగర్ డివిజన్‌కు జి.శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికైనట్లు ప్రకటించారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వీరే..

రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నాగోల్ డివిజన్‌కు చెందిన పి.నంజీవరెడ్డి, మన్సూరాబాద్‌కు చెందిన పి.కరుణాకర్‌రెడ్డి, హయత్‌నగర్‌కు చెందిన ఊదరి ఎల్లప్ప, హస్తినాపురానికి చెందిన బొమ్మిడి కిరణ్‌రెడ్డి, చంపాపేట్‌కు చెందిన బి.యాదగిరి, కొత్తపేటకు చెందిన విజయగౌడ్, చైతన్యపురికి చెందిన బి.సుమన్‌గౌడ్, గడ్డిఅన్నారానికి చెందిన వైజ్ఞేందర్‌రెడ్డి, మియాపూర్‌కు చెందిన సీహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, హఫీజ్‌పేట్‌కు చెందిన బాబు రెడ్డి, శేరిలింగంపల్లికి చెందిన ప్రశాంత్‌రావు, మాదీనగర్‌కు చెందిన జయశ్రీ, గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన శాంతలత నందులు ఎన్నికైనట్లు ప్రకటించారు.



సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు, జిల్లా కౌన్సిల్ సభ్యుల పేర్లను వెల్లడిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి